క్లుప్తంగా

ఇంటింటా ఆరోగ్య సర్వే



గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆదివారం ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను నమోదు చేస్తున్నారని మండల వైద్యాధికారి ఆనంద్‌బాబు చెప్పారు. అంతేగాక వారి డేటాను నమోదు చేయటం, అనంతరం ఏర్పాటు చేసే వైద్య ఆరోగ్య క్యాంపులలో డాక్టర్లచే వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. మాదలవారిగూడెం గ్రామంలో ఏఎన్ఎం మేరీగ్రేస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు.

దీర్ఘకాల నొప్పులపై అవగాహన అవసరం

పెనమలూరు: దీర్ఘకాల నొప్పులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఫిజియో థెరపిస్ట్, పెయిన్ మెడిసిన్ నిపుణుడు చావా మురళీకృష్ణ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్ఎస్ఎస్ విభాగం, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీర్ఘకాల నొప్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సరైన పద్ధతిలో కూర్చోకపోవటం, నిద్రించే సమయంలో సరైన పరుపులు వాడకపోవటం, ఎక్కువ సమయం కంప్యూటర్ వద్దే కూర్చోవటం వంటి కారణాల వలన నొప్పులు వస్తాయన్నారు. నొప్పులు ప్రారంభమైన వెంటనే వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాయామం, మంచి ఆహారం, ఒత్తిడి లేకుండా జీవించటంతో నొప్పుల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. డాక్టర్ నందిగం రాఘవ మాట్లాడుతూ సరైన పాదరక్షలు వాడితే నొప్పులు రాకుండా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రూప్‌కుమార్, కార్యదర్శి సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం



గన్నవరం: ప్రజానాట్య మండలి కళాకారులు ఆటపాటలు ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఆట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలను జనంలోకి తీసుకువెళ్లేందుకు కళాజాతలు దోహదపడతాయని చెప్పారు. వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో పాటలు, నాటికలు, నృత్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ కళలను ఆదరించే ప్రజలు ఉన్నంత కాలం ప్రజానాట్య మండలి కొనసాగుతునే ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ కాశిం, శిక్షకులు ఎం. పరమేష్, పలు జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

నేడు తెన్నేరులో గడపగడపకు మన ప్రభుత్వం

కంకిపాడు: మండలంలోని తెన్నేరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే పార్థసారధి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అధికారులు, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో ఉరుములు, మెరుపులతో కుండపోతగా కురిసిన వర్షం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతులకు గురయ్యాయి. బొమ్ములూరు, దంటగుంట్ల, కానుమోలు, పెరికీడు, కె.సీతారామపురం, శేరి నరసన్నపాలెం గ్రామాల్లో వర్షం కారణంగా విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. ఆయా గ్రామాల్లో పిడుగుల ధాటికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సిసులేటర్స్ ధ్వంసమయ్యాయి. పలుచోట్ల తీగలు తెగి పడ్డాయి. దీంతో హనుమాన్‌జంక్షన్ సీపీడీసీఎల్ ఏడీఈ బి.శ్రీనివాసరావు, ఏఈ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిల్చిపోవటంతో పునరుద్ధరించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి వేళ్లలోనూ పంట పొలాల్లో పర్యటించి, ఎక్కడెక్కడ విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయో పరిశీలించారు. మరమ్మతులు పూర్తి చేసి ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనం



కానూరులో నిమజ్జన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారధి,బొప్పన భవకుమార్



కానూరులో బేతాళ నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనంలో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి



పెనమలూరులో వినాయకుడి ఊరేగింపు

పెనమలూరు: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో గణనాథుడి విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. కానూరు వందడుగుల రోడ్డులోని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినాయకుడికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో అన్నసమారాధన నిర్వహించారు. పార్టీ నేతలు, శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథుడిని బేతాళ నృత్యాలు, హిరానీ నృత్యాలు, డప్పులతో భారీ ఎత్తున ఊరేగించారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, ఈడే చాముండేశ్వరి, నేతలు రాజులపాటి రామచంద్రరావు, అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, సర్పంచి కాకర్ల వెంకటరత్నం, ఏఎంసీ డైరెక్టర్ మండూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు

మండలంలో 40 విగ్రహాలు నిమజ్జనం

మండల పరిధిలో ఆదివారం 40 వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. కానూరు, తాడిగడప, యనమలకుదురు, పెనమలూరు, పోరంకి, పెదపులిపాక, గంగూరులో వినాయకుడి విగ్రహాలు నిమజ్జనం చేశారు. వినాయకుడి విగ్రహాలు 5 అడుగుల నుంచి 10 అడుగుల ఎత్తు వరకు ఉండటంతో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశారు. చోడవరం, పెదపులిపాక ఘాట్‌ల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. తాడిగడపలో మిత్ర జ్యువల్ అపార్టుమెంట్‌లో మట్టి వినాయక విగ్రహాన్ని భక్తులు పూజలు చేసి అన్నసంతర్పణ చేశారు.

గణనాథుడికి పుష్పాలతో అర్చన

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దావాజిగూడెంలోని నాయీ బ్రాహ్మణ వీధిలో జరుగుతున్న శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్న సమారాధన జరిపారు. తొలుత పలువురు దంపతుల నేతృత్వంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. దావాజిగూడెంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో గణనాథుడికి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. ఆలయ అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. స్థానిక యాదవులపేటలో గణనాథుడిని గ్రామోత్సవంగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.



దావాజిగూడెంలో గణనాథుడికి పుష్పాలతో చేసిన అర్చన



పొట్టిపాడులో నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుడు

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మండపాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనాలు తీన్‌మార్ డప్పులతో ఊరేగింపుగా వెళ్లారు. తెంపల్లి, వీరపనేని గూడెం, పొట్టిపాడు, వేంపాడు, నాగవరప్పాడు, గారపాడు గ్రామాల్లో 9వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు. పోలీసులు సూచించిన విధంగా ఆ ప్రాంతాల్లో వినాయకుని నిమజ్జనం నిర్వహించారు. తేలప్రోలు చెంచయ్య చెరువుగట్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద సోమవారం భారీ అన్నసంతర్పణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



గొడవర్రులో వినాయక నిమజ్జన ఊరేగింపు మహోత్సవం

కంకిపాడులో వైభవంగా గణేష్ నిమజ్జనం

కంకిపాడు: వినాయక నిమజ్జనోత్సవాలు ఊరూరా వైభవంగా జరుగుతున్నాయి. గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని గ్రామగ్రామానా వేడుకలు నిర్వహిస్తున్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో అంకమ్మతల్లి గుడి సెంటరులో మారుతీ సేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు కిలోల లడ్డూను చెన్ను శివ రూ.39 వేలకు వేలంలో దక్కించుకున్నారు. కంకిపాడు రజక రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపంలో ఆదివారం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద స్వామి వారి లడ్డూను రూ.8100కు ప్రవీణ్ దక్కించుకున్నారు. ఈడుపుగల్లు శ్రీ ఆంజనేయ టౌన్ షిప్‌లో స్వామి వారి లడ్డూను రూ.50 వేలకు కోనేరు పూర్ణ దక్కించుకున్నారు.

నేత్రపర్వంగా సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ 18వ వార్షికోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు వాగ్గేయకారులు రామదాసు, త్యాగరాజ స్వామి, అన్నమయ్య ముత్తస్వామి దీక్షితార్‌లు రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. భగవద్గీతలోని అక్షర పరబ్రహ్మ, రాజవిద్యా రాజగుహ్య అధ్యాయములోని శ్లోకాలను గానం చేశారు. జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి ఆధ్వర్యంలో అదివో అల్లదివో శ్రీహరి వాసము, ఇదిగో భద్రాద్రి, రామా కనవేమిరా, గరుడ గమన రారా తదితర కీర్తనలకు ఉ నృత్యాలను అభినయించారు. వార్షికోత్సవ వేడుకలను ఓఎస్‌డీ టూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చీఫ్ విప్ డాక్టర్ ఆర్.ప్రభాకర్ ప్రారంభించారు. బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ చాగంటి ఉషా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. నాట్యరంగంలో విశేషమైన కృషి చేస్తూ భగవద్గీతలోనూ కూచిపూడి నృత్యంలోనూ శిక్షణ నిస్తున్న జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తిల కృషిని అభినందించారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, కళాసుధా తెలుగు అసోసియేషన్‌కు చెందిన బేతిరెడ్డి శ్రీనివాస్‌లు ప్రసంగించారు. జంగం శ్రీనివాస చక్రవర్తి, విజయకుమర్‌లు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న బాల బాలికలకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.

అలరించిన ఆపాత మధురాలు

విజయవాడకల్చరల్: స్వరఝరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు, భక్తి గీతాల కార్యక్రమం అలరించింది. ఒంగోలుకు చెందిన తాళ్లూరి శ్రీదేవి ఆధ్వర్యంలో అంజిబాబు, డి.కోటేశ్వరరావు అశోక్ ,బాలాజీ, పూర్ణచంద్రరావు, రంగనాథం అంజుస్వామి, పద్మశ్రీలు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, జేసుదాసు ఆలపించిన గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాల్సిన అవసరముందన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు పేరుతో జిల్లాలో ఆడిటోరియం నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు. స్వరఝరి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు



భక్తి గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంసాలిపేట తమ్మిన పోతరాజు స్కూల్ ప్రాంతానికి చెందిన వీర్ల శివమ్మ, మల్లేశ్వరరావులకు నలుగురు సంతానం. మూడో అమ్మాయి నాగ దుర్గ నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. శనివారం కాలేజీకి వెళ్లి సర్టిఫికెట్స్ తెచ్చుకుంటానని చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అలరించిన మయూర ధ్వజుడు హరికథా గానం

నాగాయలంక: స్థానిక వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంబా సాయికిరణ్‌శర్మ (కౌశిక్) బ్రహ్మత్వంలో పొన్నూరు రవితేజ, జ్యోతి దంపతులచే ప్రసన్న గణపతి ఆలయంలో, ఉత్సవ విగ్రహ వేదికపై పూజలు జరిగాయి. నిత్య కార్యక్రమాల్లో భాగంగా సబ్బినేని వెంకటేశ్వరరావు (అబ్బాయి) ఆర్థిక సౌజన్యంతో కర్నూలుకు చెందిన టి.సాయిరామ్ భాగవతార్‌చే మయూర ధ్వజుడు హరికథా గానం జరిగింది. పాపర్తి ఆంజనేయులు (అవనిగడ్డ) వయోలిన్, ఎం.నగధరరావు(తెనాలి) మృదంగంతో సహకరించారు. ఈ కార్యక్రమం భక్తులను అలరించింది.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగాయలంక ప్రసన్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం 108 మంది భక్తులచే సంపూర్ణ భగవద్గీత పారాయణం జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు మండవ బాలవర్ధిరావు, ప్రతినిధి చిట్టా సాంబశివరావు ఆదివారం తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మయూర ధ్వజుడు హరికథా గానం చేస్తున్న సాయిరామ్ భాగవతార్

మహిళా బిల్లులో ఓబీసీలకు తీరని అన్యాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మహిళా బిల్లులో దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలకు తీరని అన్యాయం జరిగిందని సామాజిక న్యాయ కేంద్ర కన్వీనర్, న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో మహిళా బిల్లుపై బీసీ సంఘాలు, బీసీ కులాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ సాధనకు ఉద్యమించాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో వైకే మాట్లాడుతూ.. దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలు, మైనార్టీ మహిళలకు రిజర్వేషన్లు లేకుండా మహిళా బిల్లును రూపొందించడం దుర్మార్గమన్నారు. ఆధిపత్య కులాలకు పార్లమెంట్, శాసన సభల్లో హెచ్చు భాగం స్థానాలు కల్పించడం రాజ్యాంగంలోని సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఈ బిల్లు ద్వారా మహిళా సాధికారత సాధిస్తామనడం బూటకమని పేర్కొన్నారు. ఓబీసీ మహిళలకు కూడా చట్ట సభల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు రిజర్వేషన్లు, జాతీయ స్థాయిలో కుల గణన చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ నెల 26న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం రూరల్: వారంతా ఐదు దశాబ్దాల కిందట ఒకే చోట కలసి చదువుకున్న విద్యార్థులు. అప్పట్లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన వారు. 1970లో కలసి చదువుకుని, విద్యను పూర్తి చేసి వివిధ రంగాల్లో రాణిస్తున్న వారందరూ ఆదివారం గన్నవరం మండలం చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. విలువలు ప్రాతిపదికగా విద్య నేర్పిన గురువులను స్మరించుకున్నారు. ఆనాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువుల మార్గదర్శనంలోనే జీవితాలు కొనసాగించామని, ఆనాటి మధుర అనుభూతులను నెమరువేసుకున్నారు. క్రమశిక్షణ, రుజువర్తన, సత్యశీలత, సమాజం పట్ల బాధ్యతలు నేర్పిన గురువులు వేమూరి గోపాలరావు, పిచ్చాచార్యులుకు నివాళులర్పించారు. దుర్గా ట్యుటోరియల్ కాలేజ్, వెంకటేశ్వర ట్యుటోరియల్ కాలేజ్ విద్యార్థులైన తమకు సైన్స్ బోధన చేసిన అధ్యాపకుడు ముక్కామల ఉమామహేశ్వరరావును పూలదండలతో, శాలువాలతో సత్కరించి అభిమానం చాటుకున్నారు. పుణ్యాచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్, గూడవల్లి బాబూరావు, బాబి, కేకే చౌదరి, లావు చలపతిరావు, సాంబశివరావు, శర్మ, గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ అధ్యాపకుడు ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

అధికారంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన కుల నిర్మూలన పద్ధతులను ఆచరిస్తూ దళిత బహుజనులు రాజకీయ శక్తిగా అవతరించాలని, అధికారంతోనే అన్ని సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయని సీ ఫర్ కాస్ట్ గ్రంథ రచయిత సతీష్ చందర్ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చెంచాలే నేతలయితే అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సతీష్‌చందర్ మాట్లాడుతూ.. దళిత, బహుజనులు ఐక్యతగా ఏర్పడి తెలుగు రాష్ట్రాల్లో అధికారం కోసం, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ సదస్సులో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి మల్లికార్జునరావు, చీఫ్ అడ్వైజర్ డాక్టర్ శివరామకృష్ణారావు, ఏపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ట్రెజరర్ రాజేష్‌బాబు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నప్రదీప్, పులి దిండి వేణుగోపాల్, ఉన్నవ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సతీష్ చందర్

గుండె సమస్యలపై అవగాహన అవసరం

పటమట(విజయవాడతూర్పు): గుండె సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వరుణ్ అన్నారు. సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో పటమట వాసవ్య మహిళా మండలిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె సమస్యలను గుర్తించడానికి అవసరమైన అన్ని వసతులు నగరంలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెపై పరిశోధనలు కూడా అత్యధికమయ్యాయని, ఈ నేపథ్యంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అనంతరం సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మిత్రమండలి విజయవాడ శాఖ అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు, సభ్యులు టి.శోభనాద్రి, వై.రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, భాస్కరరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఎంవీ రావు, గోళ్ల నారాయణరావు, ప్రొఫెసర్ ప్రసాద్, తాతినేని శివాజీ, కొండపల్లి మాధవరావు పాల్గొన్నారు.



డాక్టర్ వరుణ్‌ను సన్మానిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

అందరి సహకారంతో అభివృద్ధికి కృషి

పమిడిముక్కల: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారంతో మండలాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని ఎంపీపీ కాసాని వేద సుప్రజ తెలిపారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఎంపీటీసీలుగా ప్రమాణస్వీకారం చేసి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ కేక్ కట్ చేశారు. ఎంపీటీసీలకు ఎంపీడీఓ విఠల్‌పాల్, ఎంపీపీ సుప్రజ మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుప్రజ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఏఓ రాజు, ఈవోపీఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీలు మీర్జా సజ్జాద్ అలీ, మరీదు రాజ్యలక్ష్మి, గుర్విందపల్లి వంశీ, వీర్ల ఆదిశేషు, జుజ్జువరపు శృతి, మేరుగ రాజేశ్వరి, ఊబ మల్లేశ్వరి, కంచర్ల అంకకుమారి పాల్గొన్నారు.

మొవ్వ: మండల అభివృద్ధికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అండదండలతో, మండల అధికారుల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. మండల పరిషత్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సమావేశం నిర్వహించారు. ముందుగా అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులకు, పలు గ్రామాల ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ఎంపీడీఓ జి. సుధాప్రవీణ్, పలు గ్రామాల ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు ఎంపీపీ, చందు దంపతులను సత్కరించారు.



ఎంపీటీసీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ కాసాని వేద సుప్రజ

వెయిట్ లిఫ్టర్లకు సన్మానం

గుడివాడ టౌన్: క్రీడాకారుల ఖ్యాతి చరిత్రగా మిగిలిపోతోందని ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ సభ్యులు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ఆదివారం జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన ఇరువురు వెయిట్‌లిఫ్టర్లను ఘనంగా సత్కరించారు. క్రీడలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నేపథ్యంలో రైల్వే ఉద్యోగాలు సంపాదించి ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగులుగా జీవనం సాగిస్తున్న ఇరువురు విశ్రాంత క్రీడాకారులను సన్మానించడం క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని వారు అన్నారు. వీరిలో కంది అప్పారావు విశ్రాంత రైల్వే ఉద్యోగి. రైల్వే క్రీడల్లో ఆల్ ఇండియా గోల్డ్ మెడల్‌తో పాటు జాతీయ పోటీలలో బంగారు పతకం సాధించారు. ఇక రాష్ట్ర స్థాయి పోటీల్లో 15 బంగారు పతకాలు సాధించారు. మరో క్రీడాకారుడు కె.రాయప్ప సదరన్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ ఇటీవల పదవీ విరమణ చేశారు. వీరు నేషనల్ పోటీలలో బంగారు పతకం, రైల్వే ఆల్ ఇండియా పోటీలలో బంగారు పతకం, 10కి పైగా రాష్ట్ర స్థాయి బంగారు పతకాలు సాధించారు. ఇంతటి ఘన చరిత్ర గలిగిన క్రీడాకారులను యువ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని స్టేడియం కమిటీ సభ్యులు కోరారు.స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, కృష్ణా జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ కె.దామోదరరావు, కోచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను సత్కరిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు